గ్రామాల్లో ఘనంగా బోగి మంటలు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం బోగి మంటలు వెలుతురులతో గ్రామాలు కళకళలాడాయి. ఈ పండుగ నాడు తెల్లవారు జామునే యువకులు, పెద్దలు కలసి వీధుల్లో బోగిమంటలు వేశారు. యువకులు ఈ పండుగ కోసం గత వారం రోజులు ముందుగానే కట్టెలు, పిడకలు సేకరించి, ఈ బోగిమంటలో వేశారు.

మహిళలైతే ఉదయాన్నే తలస్నానం చేసి కొత్తబట్టలు ధరించి బోగి దండలను మంటలో వేసి భక్తి శ్రద్ధలతో నమస్కరిస్తారు. మండలంలోగల ఊడికలపాడు, కోటబొమ్మాళి, దంత, కురుడు, హరిశ్చంద్రపురం, లఖందిడ్డి, గంగరాం, యలమంచలి, పాకివలస, శ్రీజగన్నాధపురం, నిమ్మాడ, తిలారు తదితర గ్రామాల్లో ఘనంగా బోగి పండగ నిర్వహించారు.

శిష్టకరణ పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ

విశాలాంధ్ర-నరసన్నపేట : శిష్టకరణ కార్పొరేషన్ డైరక్టర్, సదాశివుని కృష్ణ అధ్యక్షతన శిష్టకరణ పేదలకు శనివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మారుతీనగర్-1వ వీధికి చెందిన రఘుపాత్రుని బాలకృష్ణ పట్నాయిక్ - విజయలక్ష్మీ దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారులు, రఘు పాత్రుని రమేష్, రాధాకృష్ణ(చంటి), శ్రీధర్(బుజ్జి)లు సరుకులు సమకూర్చారు. అనంతరం డైరక్టర్, కృష్ణ మాట్లాడుతూ పేదరికం పూర్తిస్థాయిలో నిర్మూలన చేసేందుకు ముఖ్యమంత్రి, జగన్మోహన్‌రెడ్డి పేదలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో శిష్టకరణ సంఘ ప్రతినిధులు, సదాశివుని ప్రభాకరరావు, అంపలాం వసంతకుమార్, కుప్పిలి వైకుంతరావు, ఉరిటి జగన్నాధరావు, బలివాడ రాము, చౌదరి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విధానాలపై నిరసన

విశాలాంధ్ర-పోలాకి: ప్రజా వ్యతిరేక విధానాలపై మండల తెలుగుదేశం పార్టీ నిరసన వ్యక్తం చేసింది. శనివారం రాష్ట్ర పార్టీ ఆదేశాలమేరకు ప్రతిపక్షాల గొంతు నొక్కే జీఓ 1 ప్రతులను భోగి మంటలో వేసి ప్రభుత్వానికి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షులు మిరియప్పల్లి వెంకట అప్పలనాయుడు మాట్లాడుతూ ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత రోజు రోజుకి పెరగడంతో కుటిలమైన జీవోలు ప్రభుత్వం తెస్తుందని దయ్యబట్టారు. ప్రజా వ్యతిరేక విధానాలు విడనాడకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. జిల్లా రైతు కార్యదర్శి లుకలాపు రాంబాబు మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలలో ప్రభుత్వంపై వ్యతిరేకత మొదలైందని రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఏర్పడుతుందని అందుకు ప్రజాస్పందన కనిపించడంతో ప్రభుత్వం వ్యతిరేక విధానాలకు శ్రీకారం చుట్టినట్లు ఉందన్నారు. టిఎన్‌ఎస్‌ఎఫ్ కార్యదర్శి టి. గౌరినాయుడు, వై. వి. హరికృష్ణ, బూత్ కమిటీ మెంబెర్ కె. వెంకటేశ్వరావు, ఎన్. సాయి, వి. రాంబాబు, ఎల్. నాగేశ్వరావు, కామేష్, శంకర్ పాల్గొన్నారు.

ఎన్ఈఆర్ వస్త్రాలు పంపిణీ

విశాలాంధ్ర-రణస్థలం : మండలం, బంటుపల్లి పంచాయతీ నడుకుదిటిపాలెం ఎన్ఈఆర్ కేంపస్ వద్ద భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఎచ్చెర్ల నియోజకవర్గం ఇన్‌చార్జ్ నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్), సర్పంచ్ రజని ఆధ్వర్యంలో సంక్రాంతిని పురస్కరించుకొని పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్రాంతి పండుగను ప్రతి ఒక్కరు సంతోషంగా జరుపుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మహాలక్ష్మి అప్పలకొండ, ఎన్ఈఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ విద్యా సంస్థల డైరెక్టర్ తేజ, బంటుపల్లి ఎంపీటీసీ తొంపల సంజీవ్ రావు, బంటుపల్లి మాజీ ఎంపీటీసీ గురాల రఘునాథ్, తొంపల అప్పల రాజు, గోపిన కృష్ణా రావు, గోవిందాసు త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

అందరి ఆనందమే... నా ఆనందం

- రాష్ట్ర సర్పంచుల సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ పిన్నింటి వెంకట బాలాజీ నాయుడు
- ఏటేటా పేదలకు దుస్తులు పంపిణీ... - యువతకు ఆటల పోటీలు నిర్వహణ

విశాలాంధ్ర-రణస్థలం : గ్రామపంచాయతీ సర్పంచ్, సేవే పరమావధిగా భావించినటువంటి యువ నాయకుడు పిన్నింటి వెంకట భానోజీ నాయుడు (భాను) పండగ ఆనందం మనకే కాదు ప్రతి పేదవాని ముఖంలో పండగ ఆనందం కనిపించాలని ఉద్దేశంతో ఏటేటా పేదలకు వస్త్రాలు పంపిణీ చేస్తారు. అదేవిధంగా ఈ ఏడాది కూడా పంచాయతీలో ఉన్నటువంటి నాలుగు గ్రామాల్లో ఉన్న పేద ప్రజలు అందరికీ గ్రామాల్లో ఉన్న పేదలందరికీ వస్త్ర దానం తల్లిదండ్రుల చేతుల మీదుగా నిర్వహించారు. ఆయన చేసినటువంటి ప్రజాసేవే అతనిని పంచాయతీ ప్రజలు సర్పంచ్ గా ఎన్నుకున్నారు. ఆయన సర్పంచిగా ఎన్నికైన తర్వాత రణస్థలం పంచాయతీలో ఉన్నటువంటి సమస్యలన్నీ పరిష్కరించి పంచాయతీని అభివృద్ధి పదంలోకి నడిపించారు. ఆయన సేవలను అభివృద్ధిని గుర్తించి ఈ ఏడాది రాష్ట్ర పంచాయతీ సర్పంచుల సంఘం ఆర్గనైజేషన్ సెక్రటరీగా బానోజీ నాయుడును ఎన్నుకున్నారు. పండగ రోజుల్లో యువత పక్క త్రోవ పట్టకుండా పండగ మూడురోజులు ఆటల పోటీలు నిర్వహించి వారికి బహుమతులను ప్రదానం చేసే కార్యక్రమాన్ని గత రెండు సంవత్సరాలుగా నిర్వహిస్తున్నారు. అదేవిధంగా ఈ ఏడాది కూడా యువత పండుగ దినాల్లో చెడు వ్యసనాలకి త్రాగుడు, జూదం చెడు వ్యసనాలకి వెళ్లకుండా వారికి ఆటల పోటీలు నిర్వహించి యువత మంచి మార్గంలో నడవడానికి సహాయపడుతున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ప్రతినిధి మజ్జి వెంకటరమణ, వార్డు మెంబర్లు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

జీవోనెం.1ను బోగి మంటల్లో వేసిన అచ్చెన్నాయుడు, రామ్మోహన్‌నాయుడు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు, శ్రీకాకుళం పార్లమెంటు సభ్యులు కింజరాపు రామ్మోహన్ నాయుడులు శనివారం నిమ్మాడలో ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రతి పక్షాలనే టార్గెట్ చేసుకొని రాజకీయ పార్టీల స్వేచ్ఛా హక్కును కాలరాసే విధంగా జారీ చేసిన జీవో నెంబర్-1ను బోగి మంటల్లో వేసి కాల్చి ఈ ఉత్తర్వులను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని గ్రామస్థులతో కలిసి నినాదాలు చేశారు. అలాగే రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు పైన అక్రమ కేసులు బనాయించిన ఎఫ్ఐఆర్ కాపీలను కూడా మంటల్లో వేసి సైకోపాలన పోవాలి సైకిల్ పాలన రావాలని నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మెండ దాలినాయుడు, లాయర్ అచ్చెన్నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుస్తులు, దుప్పట్లు పంపిణీ

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : మండలంలోగల శ్రీజగన్నాధపురం సర్పంచ్ నూక సత్యరాజు తల్లిదండ్రులు జ్ఞాపకార్థం పేదలకు, వృద్ధులకు శనివారం దుస్తులు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుమారు 150 మందికి సంక్రాంతిని పురస్కరించుకొని చీరలు, వంచెలు, దుప్పట్లుతో పాటు కొంత నగదును, భోజనం పంపిణీ చేశారు. ప్రతి యేటా బోగిపండగనాడు తనవంతు సహాయంగా చీరలు, దుప్పట్లు పేదలకు పంపిణీ చేయటం జరుగుతుందని ఆయన తెలిపారు.

ఏపీ ఫార్మసీ జాయింట్ యాక్షన్ కమిటీకి వైస్ చైర్మన్‌గా డాక్టర్ హేమంత్ కుమార్

విశాలాంధ్ర - కోటబొమ్మాళి: ఆంధ్రప్రదేశ్ ఫార్మసీ జాయింట్ యాక్షన్ కమిటీకి వైస్ చైర్మన్‌గా డాక్టర్ నంబాళ హేమంత్ కుమార్ నియమితుల య్యారు. అతను శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం, యలమంచిలి గ్రామానికి చెందిన వ్యక్తి, ఆయన ప్రస్తుతం డాక్టర్ ఆఫ్ ఫార్మసీ అసోసియేషన్ ఇండియన్ ఫార్మసిస్ట్ అసోసియేషన్‌కు వైస్ ప్రెసిడెంట్‌గా పనిచేస్తున్నాడు. ఈ హోదా రెండేళ్ల వరకు చెల్లుతుంది. హేమంత్ అన్ని అసోసియేషన్ అధ్యక్షులు మరియు వైస్ ప్రెసిడెంట్‌లకు చాలా కృతజ్ఞతలు తెలిపారు.

నేటి సమాజానికి వివేకానంద స్వామి స్ఫూర్తి

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : నేటి సమాజానికి వివేకానంద స్వామి స్ఫూర్తి అని ప్రవచన కారులు కోత మధుసూదనరావు అన్నారు. వివేకానంద స్వామి జన్మ దినోత్సవము, భోగి, సంక్రాంతి సందర్భంగా సంతబొమ్మాళి మండలం, చెట్లతాండ్ర గ్రామంలో, ఉన్న శ్రీ రామకృష్ణ పరమహంస మందిరంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత సమాజానికి వివేకానంద స్వామి సూక్తులు ఎంతో ఉపయోగ కరంగా, ఉత్తేజంగా, ఉల్లాసపరితాన్ని ఇస్తాయని, మానవుని దిశా నిర్దేశాన్ని తెలియజేస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో వివేకానంద స్వామి రామకృష్ణ పరమహంస సమాజానికి సంబంధించిన ప్రతినిధి, సంపతి రావు విశ్వనాథం, సింహాచలం, రామకృష్ణ పరమహంస మతం భక్తులు తదితరులు పాల్గొన్నారు.

జనసైనికులు కుర్చీలాట

విశాలాంధ్ర-నందిగాం : మండలం దీనబంధు పురం గ్రామంలో జనసేన నాయకులు జనసైనికులు కలిపి సిమెంట్ కుర్చీలు ఏర్పాటు చేశారు. గ్రామంలో జనసేన పార్టీ తరఫున మరిన్ని కార్యక్రమాలు చేస్తామని జనసైనికులు తెలిపారు.

ఆదిత్యుని దర్శించుకున్న హైకోర్టు జడ్జి

విశాలాంధ్ర-అరసవల్లి: ప్రత్యక్షదైవం ఆరోగ్య ప్రదాత అయినటువంటి శ్రీ సూర్యనారాయణ స్వామి వారిని శనివారం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి తర్లాడ రాజశేఖర్‌రావు దేవాలయంనకు విచ్చేసి శ్రీ స్వామి వారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఘనంగా స్వాగతం పలికారు. తదుపరి ఆలయ అర్చకులు వేద మంత్రాలతో ఆశీర్వదించారు. వారికి శ్రీ స్వామి వారి జ్ఞాపికను ఆలయ ఇంచార్జ్ సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వరరావు అందజేశారని, కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా, ప్రోటోకాల్ జడ్జి కె.రాణి, శ్రీకాకుళం ఎంఆర్ఓ వెంకట్ రావు, ఆలయ జూనియర్ అసిస్టెంట్ బి ఎస్ చక్రవర్తి, పోలీస్ సిబ్బంది, కోర్ట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్వేచ్ఛను హరించే జీఓ నెంబర్-1ని రద్దు చెయ్యాల్సిందే

- సీపీఐ జిల్లా కార్యదర్శి బలగ శ్రీరామ్మూర్తి
- బోగీ మంటల్లో జీఓ పత్రాలు దహనం

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం: రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన చీకటి జీఓ నెంబర్ 1 ను తక్షణమే రద్దు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బలగ శ్రీరామ్మూర్తి డిమాండ్ చేశారు. రాష్ట్ర పార్టీ పిలుపు లో బాగంగా శనివారం స్థానిక బ్యాంకర్స్ కాలనీ లో జరుపుకున్న బోగీ పండుగ మంటల్లో ఆ జీఓ పత్రాలను దహనం చేశారు. ఈ సందర్భంగా శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ ప్రజల హక్కుల కోసం పోరాటాలు చెయ్యడానికి కూడా వీలు లేకుండా చేసేందుకు ఈ జీఓ ను రాష్ట్ర ప్రభుత్వం తీసుకు రావటం దుర్మార్గం అన్నారు. బ్రిటీష్ కాలం లో కూడా ఇలాంటి చట్టాలు లేవని, ఇప్పుడు ఇ లాంటి దుర్మార్గ జీవోలు ఇస్తున్నారంటే రాష్ట్ర ప్రభుత్వ దుర్మార్గాలకు అద్దం పడుతుందన్నారు. ఆ జీఓ ను రద్దు చెయ్యాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ హై కోర్టు లో పిటీషన్ వేస్తే ఆ తరుపున వాదించిన న్యాయ వాధి కి రక్షణ లేకుండా పోయిందని, వాదన ల అనంతరం న్యాయవాది ని రెండు పోలీస్ జీపు ల్లో ఇంటికి తీసుకు వెళ్లాల్సిన పరిస్థితి వచ్చిందంటే రాష్ట్రం లో శాంతి భద్రతలు ఎలా ఉన్నాయో అర్థమవుతుందన్నారు. ఇలాంటి చీకటి జీఓ లు ప్రతీ ఒక్కరూ వ్యతిరేకించాలని అయన పిలుపు నిచ్చారు. ప్రజల సమస్య ల మీద వామపక్షాలు, ప్రజా సంఘాల పోరాటం ఎవరూ ఆపలేరని, ఎన్ని అడ్డంకులు సృష్టించినా ప్రజల పక్షాన సీపీఐ పోరాటం ఆగదన్నారు. ఈ కార్యక్రమం లో సీపీఐ జిల్లా సమితి సభ్యులు కొమర. భాస్కరరావు, డీహెచ్‌పీఎస్ జిల్లా నాయకులు బలగ రామారావు, రైతు సంఘం నాయకులు అప్పారావు, మహిళా సభ్యురాలు సతివాడ నీలవేణి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద బాధిత కుటుంబానికి నిత్యవసర సరుకులు పంపిణీ

విశాలాంధ్ర-కవిటి: మండలంలోని బి.గొనపపుట్టుగ గ్రామానికి చెందిన మల్లార్పు మోహనరావు అనే రజక కుటుంబానికి చెందిన నిరుపేద ఇటీవల జరిగిన రైలు ప్రమాదంలో తన రెండు కాళ్లు పోగొట్టుకొని నిరాశ్రు డయ్యాడు. విషయం తెలుసుకున్న బొరివంక గ్రామానికి చెందిన ఉద్దాన యూత్ క్లబ్ ఆధ్వర్యంలో అతని కుటుంబానికి సహాయం అందజేయాలని వారు అమలు చేస్తున్న ఆసిరి పోలమ్మ అమృత కలశం పథకంలో భాగంగా ప్రమాద బాదితుని కుటుంబానికి రెండు నెలలకు సరిపడే నిత్యావసర సరుకులను శనివారం భోగి పండుగ సందర్భంగా స్థానిక సర్పంచ్ బద్రి ప్రకాష్,బొరివంక-1 ఎంపీటీసీ సతీష్ కుమార్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్ష,కార్యదర్శులు దీనబంధు,వెంకటేశులు మాట్లాడుతూ తమ క్లబ్ ఆధ్వర్యంలో గత కొన్ని సంవత్సరాలు నుంచి నిరుపేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నామని అందులో భాగంగా ఈ ప్రమాద బాధిత కుటుంబానికి నిత్యావసర సరుకులను సోంపేటకు చెందిన ఎంపీటీసీ సభ్యులు వైశ్యరాజు నిత్యవెంకన్న ఆర్థిక సహాయంతో అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్దానం యూత్ క్లబ్ సభ్యులు మోహన్,గోపి,ప్రదీప్,ప్రకాష్,మణికంఠతో పాటు రజక కుల సంఘ పెద్దలు పాల్గొన్నారు.

కలమటకు ముందస్తు పుట్టినరోజు శుభాకాంక్షలు

విశాలాంధ్ర-కొత్తూరు : పాతపట్నం తెలుగు దేశం నియోజకవర్గ ఇంఛార్జి, మాజీ. ఎమ్మెల్యే కలమట వేంకట రమణ ఈనెల 15 (సంక్రాంతి) పుట్టినరోజు కావడంతో పలువురు ఆభిమానులు, పార్టీ నాయకులు శనివారం ఇక్కడ (కలమట కాంప్లెక్) ఆయన్ని కలిసి ముందస్తుగా పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఆభినందిం చిన వారిలో ఆ పార్టీ సీనియర్ నాయకులు దివాంగత ఎన్టీఆర్ వి రాభిమాని కళింగ వైశ్య సంఘం నాయుకులు పెద్దిని కులశాఖర్ ఆళ్వార్, కర్లేమ్మ సర్పంచ్ లోతుగెడ్డ భగవాన్ నాయుడు, పార్టీ నాయకులు క్రిష్ణా రావు, రాజారావు, అమర్నాథ్, సంతోష్ తదితరులు ఉన్నారు.

పేదలకు నూతన వస్త్రాలు పంపిణీ

విశాలాంధ్ర-రణస్థలం: మండలం జెఆర్ పురం పంచాయతీలో టీడీపీ రణస్థలం మండలం నాయకులు కొప్పిశెట్టి లక్ష్మణరావు, ప్రతి సంవత్సరం పేదలకు, వృద్దులకు, బట్టలు చేస్తారు ఈ సంవత్సరం కూడా 500 మందికి బట్టలు పంపిణి చేశారు. ఈ కార్యక్రమం లో తెలుగుదేశం పార్టీ మండల నాయకులు డా. డి రామారావు, తిప్పాన బాబురావు, గంట్యాడ అప్పలనాయుడు, వైకుంట రావు, గోవిందాసు రమేష్, దారపురెడ్డి సంతోష్, అప్పలరాములు, కె.లక్ష్మణ, పి. శ్రీను, తవుడులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రైతులను ఆదరించేలా ప్రభుత్వాలు ఉండాలి

విశాలాంధ్ర -ఆమదాలవలస: భారతదేశానికి వెన్నెముకగా ఉండే రైతును ఆదరించేలా ప్రభుత్వాలు ఉన్నప్పుడు ఆరోగ్యవంతమైన భారతదేశ నిర్మాణం అవుతుందని రోటరీ క్లబ్ అధ్యక్షులు పాత్రుని పాపారావు అన్నారు. శనివారం కొర్లకోట గ్రామంలో రైతు మిత్ర పురస్కారాలను అందించారు. ఆదర్శ రైతులు పాత్రుని నరసింహులు, పేడాడ అప్పలనాయుడు, నక్క దామోదరరావు, సనపల చల్లమనాయుడు, భాస్కర రావు, తమ్మిన లక్ష్మీనారాయణ, పేడాడ లక్ష్మనాయుడు, పైడి జగన్నాథం, గురుగుబెల్లి రాజారావు, అన్నెపు అప్పారావు లను సత్కరించి రైతు మిత్ర పురస్కారాలను అందించారు. రైతు సుభిక్షంగా ఉంటే దేశం అన్నపు గిన్ని అవుతుందని వక్తలు అన్నారు. ఈ కార్యక్రమంలో రొటేరియన్ తేజలక్ష్మి, సనపల డిల్లేశ్వరరావు, అన్నెపు భాస్కరరావు, సనవల అన్నాజీ రావు, పేడాడ వైకుంఠరావు, నర్సింగ్ రావు, సనపల అప్పలనాయుడు, గ్రామస్తులు పాల్గొన్నారు.

హడలెత్తిస్తున్న అడవి జంతువు

- మామిడిపల్లి పంచాయతీలో లేగదూడలపై విచక్షణ రహితంగా దాడి
- బావురమంటున్న ఉద్దానం రైతులు

విశాలాంధ్ర-సోంపేట : ఎవరికి కనబడకుండా రాత్రి వేళల్లో ఉద్దానం తోటల్లో సంచరిస్తూ ఆవులు, లేగదూడలపై విచక్షణ రహితంగా ఓ అడవి జంతువు దాడులకు పాల్పడి ఆయా జంతువులను నిర్దాక్షిణ్యంగా చంపేస్తోంది. శుక్రవారం అర్ధరాత్రి కూడా ఇదే తరహాలో మామిడిపల్లి పంచాయతీ సుమారు ఐదారు లేగ దూడలతో పాటు మేకలపై దాడి చేసి వాటిని తీవ్రంగా గాయపర్చి చంపడంతో ఆ రైతులు తీవ్ర ఆవేదనకు గురౌతున్నారు. అరకొర బతుకులతో వ్యవసాయంపై ఆధారపడి పశువులను పెంచుకుంటూ కాలం వెళ్లదీస్తున్న రైతన్నలకు ఈ అడవి జంతువు ఘాతుకాలు ఎంతగానో హడలెత్తిస్తున్నాయి. ఆయా రైతులు వ్యవసాయ తోటల్లో పాకలు నిర్మాణం చేసి రాత్రి వేళల్లో వాటిల్లోనే పశువులను సంరక్షించడం ఆనవాయితీ. ఇటువంటి పరిస్థితుల్లో ఈ అడవి జంతువు చేస్తున్న దాడులతో రైతులు తీవ్రంగా నష్టపోయి ఎంతగానో కలవరపడుతున్నారు. వేలాది రూపాయల విలువైన పశువులను కోల్పోయిన బాధిత రైతులు పడుతున్న వేదన అంతా ఇంతా కాదు. మామిడిపల్లి సర్పంచ్ ఇదే విషయమై అటవీ అధికారులకు ఫిర్యాదు చేయగా గతంలో తీవ్ర ప్రయత్నాలు చేసినప్పటికి అధికారులకు అడవి జంతువు చిక్కకపోవడంతో వారు సైతం వెనుదిరిగారు. చిరుతపులి ఆకారంలో ఉండే అడవి పిల్లి ఈ దాడులకు పాల్పడి వుండవచ్చని అటవీ అధికారులు భావిస్తున్నారు. తోటల్లో సిసి కెమెరాలు, బోన్లు వగైరాలు ఏర్పాటు చేసినప్పటికి జంతువు మాత్రం చిక్కకపోవడంతో అధికారులు సైతం నిరాశ చెందుతున్నారు. అయితే రైతులు ఏమి చేయాలో తెలియక తీవ్ర ఆందోళనతో సతమతమవుతున్నట్లు సర్పంచ్ శేషగిరి విలేకర్లకు తెలిపారు. అధికార యంత్రాంగం మళ్లీ అప్రమత్తమై దాడులకు పాల్పడుతున్న జంతువును ఎలాగైనా పట్టుకోవాలని, ఉద్దానం ప్రాంతాన్ని రక్షించాలని కోరుతున్నారు.

ఉత్సాహంగా భోగి పండుగ

విశాలాంధ్ర-కవిటి : మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలు ఉత్సాహంగా భోగి పండుగ జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లో యువత భోగి మంటలు ఏర్పాటు చేసి ఆనందంగా గడిపారు. భోగి పండుగ సందర్భంగా సాయంత్రం చిన్నారులకు వరుసక్రమంలో కూర్చోబెట్టి చిన్నారుల తలపై చెరుకుగడ ముక్కలు,బంతి పూల రెక్కలు, చిల్లర నాణాలు, రేగుపళ్ళు పోశారు. ఇలా చేయడం వల్ల పిల్లల మీద ఉన్న చెడు దృష్టి తొలగిపోతుంది. తలపై భాగంలో బ్రహ్మరంధ్రం ఉంటుంది. భోగి పండ్లను పోసి దాని ప్రేరేపితం చేస్తే, పిల్లల్లో జ్ఞానం పెరుగుతుందని నమ్మకం.

పల్లె గూటికి పండగొచ్చింది!

- సొంతూళ్లకు తిరిగివస్తున్న వలసజీవులు
- చిన్నారులు, వృద్ధుల ముఖాల్లో కళకళ
- ప్రజల రాకతో సందడిగా గ్రామాలు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : పచ్చని పొలాలు... కల్లాల్లో పండిన పంటలు... తల్లిదండ్రులు... అన్న దమ్ములు... అక్కచెల్లెల్ల అప్యాయతా అనురాగాలు.... ఉన్నంతలో కలసిమెలిసి సాగే జీవనం.... ఒక్కమాటలో చెప్పాలంటే పల్లెలోగిలికి కుటుంబమే అభరణం... ఇదీ మన పల్లె ఖ్యాతి.. కానీ పల్లెల్లో ఇప్పుడు అ పరిస్థితి ఎక్కడా కనిపించడం లేదు. వీధుల్లో తాళం వేసిన ఇళ్లు.. చెట్ల కింద వృద్దులు నిరీక్షణ... ఏవైనా పండగలు వస్తే తప్ప పల్లెల్లో కళ లేకుండా పోయింది. సొంతూరిని, కన్నవారిని కులసుకొనేలా 'సంక్రాంతి' పండగ తెచ్చింది. పిల్లలంతా బతుకుతెరువుకు పట్టణాలు పోతే ఇంటివద్ద నిరీక్షిస్తున్న ముసలి ప్రాణాలకు మళ్లీ వీరి రాకతో గ్రామాల్లో ప్రేమబంధాలు వెల్లివిరుస్తున్నాయి. కారోనా కారణంగా గ్రామాల్లో చేసేందుకు పనిలేక పొట్టకూటి కోసం ఊరు విడిచి సుదూర ప్రాంతాలకు వలస వెళ్లిన కార్మికులు సంక్రాంతి పండగకు సొంతూళ్లకు చేరుకుంటున్నారు. వలసలు పోవడంతో జనసంచారమే లేక నిన్నటివరకు ఇళ్లకు తాళాలు వేసి బోసిపోయిన గ్రామాలు నేడు జనంతో సందడిగా కనిపిస్తున్నాయి. వలసలతో ఆత్మీయబందాలతో పాటు బాల్యం కనుమరుగై పోగా అక్కున చేర్చుకునే అలనా, పాలనా కరువై అష్టకష్టాలు పడుతున్న చిన్నారులకు మరో 10రోజుల పాటు తల్లిదండ్రులు ప్రేమానురాగాలను పొందనున్నారు. సంక్రాంతి పెద్ద పండగ కావటంతో ఉపాధి, ఉద్యోగాలు, వివిధ పనుల్లో ఇతర ప్రాంతాల్లో ఉన్నవారు స్వగ్రామాలకు తిరిగి వస్తున్నారు. గత ఆరు నెలలుగా సంపాదించిన సొమ్ముతో ఇళ్లకు సున్నాలు వేసి, కొత్త దుస్తులు కొనుక్కొని సంక్రాంతి పండగను ఆనందంగా జరుపుకోనున్నారు. గత వారం రోజులుగా కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, టెక్కలి, మండలాల్లో ఉన్న రైల్వే, బస్సుస్టేషన్‌లో రైలు, బస్సులు నుంచి దిగిన కూలీలే ఎక్కుగా కనిపించారు.

ఎంతో ఆనందం : మా గ్రామంలో ఉపాధి కరవైంది . దీంతో హైదరాబాద్, చెన్నాయ్, ఒడిస్సా వంటి ప్రాంతాలకు వలస పోవాల్సివస్తోందని కోటబొమ్మాళి మండలంలోని యలమంచిలి వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొట్టకూటి కష్టాలతో పొరుగు ప్రాంతాలకు వెళ్లి పస్తులుండి కూడబెట్టిన సొమ్ముతో పండుగకు ఇంటి కొచ్చాం. కుటుంబ పెద్దలు, పిల్లాపాపలతో ఊసులాడు తుంటే ఎంతో ఆనందంగా ఉంది. ఇలాగే ఉంటే కుటుంబం గడవటం కష్టం. గ్రామంలోని యువకుల్లో డిగ్రీ, పీజీలు చేసినవారే ఉన్నారు. వీరంతా పొరుగు రాష్ట్రాలకు వెళ్లి కూలీపనులు చేసుకోవాల్సి వస్తోంది. రోజుకు రూ. 500 కూలీకి యువతీ, యువకులు నిర్మాణ కార్మికులు, మట్టిపనులకు వెళ్తాం. పొరుగు ఊళ్లలో పడేకష్టం పడాల్సిందే. ఉండటానికి ఇళ్లు కడుపునిండా తిండి ఉంటే ఇంటికి తెచ్చేందుకు ఇంక ఏమీ మిగలదు.

- వలసకూలీలు, యలమంచిలి.

పిల్లల చదువు కోసమే: కన్నవారిని, సొంతూరిని వదిలి వెళ్లాలంటే బాదగా ఉంటుంది. నా వాళ్ళు.. మా బందువులు... ఇళ్లు ఇక్కడే వున్నా బతుకుతెరువు కోసం, పిల్లల చదువు, వారి బంగారు భవిష్యత్ కోసం కష్టాన్ని దిగమింగి వలసలు వెలుతున్నాం. మేం అక్కడ ఉన్నా పిల్లలు, వారి భవిష్యత్ పైనే దృష్టి పెడతాం. వారికి ఏం చేస్తే మాలా వలసలు వెళ్లకుండా మంచి జీవితాలు గడుపుతారోనని అలోచిస్తాం. చక్కగా చదువుకొని మంచి ఉద్యోగాలు పొందేందుకే మేం కష్టపడుతున్నాం.

- నేతింటి శంకరరావు, కోటబొమ్మాళి.

అంగరంగ వైభవంగా భోగభాగ్యాల భోగి

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం : హిందువులకేకాక యావత్ భారతీయులకు ఎంతో ప్రాధాన్యమైన పండగ భోగి అని పలువురు వక్తలు కొనియాడారు. శనివారం భోగి సందర్భంగా శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో స్టార్ వాకర్స్ క్లబ్ మరియు ఆర్ట్స్ కళాశాల బృందం సంయుక్త నిర్వహణలో ఏర్పాటు చేసిన భోగి పండగ కార్యక్రమంలో భాగంగా ముందుగా సంప్రదాయబద్ధంగా భోగి మంటలు వేశారు. ఈ సందర్భంగా వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థలు మాజీ గవర్నర్ జి.ఇందిరాప్రసాద్ మాట్లాడుతూ.. ప్రాచీన కాలం నుండి ఆచారంగా వస్తున్న మన సంస్కృతి, సంప్రదాయాలు మర్చిపోకుండా ఉండేందుకు ఇట్లాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. తొలిపంట ఇంటికి చేరి, రైతన్నలు హృదయాల్లో ఆనందాలు విహరింపజేస్తుందని అన్నారు. తెలుగు ప్రజల సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి అని,భోగి పండగ సంక్రాంతి ముందు వస్తుందని ,దీన్ని వైభవంగా వాడవాడలా జరుపుకోవటం అనాది కాలం నుండి వస్తుందన్నారు. క్రిమి కీటకాలు నాశనం చేసే శక్తి ఒక్క భోగి పండగకు మాత్రమే ఉందని,ఆవు పేడతో తయారుచేషే భోగి పిడకల్లో చాలా ఔసుధగుణాలు ఉన్నాయని, వాటిని మంటల్లో వేయటం వల్ల అవి కాలి.. తద్వారా వొచ్చే పొగవల్ల క్రిమి కీటకాలు నాశనమౌతాయన్నారు. స్టార్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు శాసపు జోగినాయుడు మాట్లాడుతూ.. ప్రజల జీవితాల్లో వెలుగులు నింపే మకర సంక్రాంతి, భోగి, కనుమ పండగలు ప్రతీ ఒక్కరూ సంప్రదాయబద్ధంగా చేసికొని, సుఖశాంతులతో జీవించాలని ఆకాక్షించారు. రోటరీ క్లబ్ ప్రతినిధి ఐకె.రావు మాట్లాడుతూ.. గడిచిన రెండు మూడేళ్ల కాలంలో కరోనా వంటి మహమ్మారి ప్రభావంతో అతలాకుతలమైపోయిన ప్రజానీకం, ఈ ఏడాది ఎటువంటి కరోనా భయం లేకపోవడంతో ఎంతో అట్టహాసంగా, సందడిగా భోగి పండగ జరుపుకున్నారన్నారు. కులాలకు,మతాలకు, ప్రాంతాలకు అతీతంగా జరుపుకొనే పండగ సంక్రాంతి, భోగి, కనుమ పండుగలన్నారు. నవగ్రహ దోషాలు తొలగి, భోగభాగ్యాలు కలగాలని ఆయన అభిలసించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ చీఫ్ కోఆర్డినేటర్ పి.జి.గుప్తా, సామాజికవేత్త తమ్మిశెట్టి శ్రీ భార్గవి, వాకర్స్ ప్రతినిధులు డాక్టర్ కె. పాండురంగారావు, అందవరపు రవి కుమార్, జి.వెంకటప్పల నాయుడు, ఎం.మల్లిబాబు, గోలీ ఉమామహేశ్వర రావు, సంతోష్, అశోక్ మీడియా ప్రతినిధులు బి.రమేష్ బాబు, లంక సాయి, పుణ్యపు కూర్మారావు, ఎన్. అప్పారావు, కె.కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు మనిషికి మానసిక ఉల్లాసాన్నిస్తాయి

జిల్లా ప్రణాళిక అధికారి రామారావు



విశాలాంధ్ర-కాశీబుగ్గ : క్రీడలు మనిషికి ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయని జిల్లా ప్రణాళిక అధికారి గేదెల రామారావు అన్నారు. శనివారం ఉద్దాన విద్యాభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో 5కె రన్ రంగోయి రైల్వేగేటు వద్ద ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మనిషికి శారీరక ఆనందానికి దోహదపడతాయని అన్నారు. కార్యక్రమంలో ఎంపిడివో రమేష్‌నాయుడు, గ్రీన్ ఆర్మీ అధ్యక్షులు బోనెల గోపాల్, యు.వి.వి.అధ్యక్షులు ఇ.జోగారావు, బొడ్డు చిన్నారావు, ఎం.కామేశ్వరరావు, బత్తిని ఓంకార్, రెయ్యి కృష్ణారావు, తెప్పల వాసుదేవరావులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాలను పరిశీలించిన కాశీబుగ్గ డీఎస్పీ

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : ఈనెల 22వ తేదీన కోటబొమ్మాళిలో జరగనున్న పోలీస్ కానిస్టేబుల్ వ్రాత పరీక్ష కేంద్రాలను కాశీబుగ్గ డీఎస్పీ ఎం.శివరామిరెడ్డి టెక్కలి సిఐ సూర్య చంద్రమౌళితో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వంశధార విద్య సంస్థల్లో రెండు పరీక్ష కేంద్రాలు ఉంటాయని, అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒకటి, విక్టరి విద్య సంస్థల్లో ఒక్క పరీక్ష కేంద్రాలు ఉంటాయని ఆయన తెలిపారు. ఈ కేంద్రాల్లో అన్ని మౌళిక సదుపాయాలు, భద్రత ఆయన పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వంశధార విద్యాసంస్థల కరస్పాండెంట్ చింతడ అనిరుద్దుడు, ఎస్ఐ షేక్ ఖాదర్‌భాషా తదితరులు పాల్గొన్నారు.

ఎగిసిన భోగి మంటలు

విశాలాంధ్ర-కాశీబుగ్గ : పండుగలో తొలి రోజైన భోగి మంటలు పలాస-కాశీబుగ్గ మున్సిపాల్టీలో ఎగిసి పడ్డాయి. భోగభాగ్యాలనిచ్చే భోగి ఉత్సవాన్ని శనివారం వేకువజామున లేచి భోగి మంటలు వేశారు. అయితే భోగి మంటలు నిర్వహణకు శుక్రవారం అర్ధరాత్రి నుంచే ముఖ్య కూడళ్లలో స్థానిక యువకులు, విద్యార్థులు, మహిళలు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. గ్రామ పొలి మేరల్లో ఉన్న చెట్లు కొమ్మలతో ఈ భోగి మంటలు ఏర్పాటు చేశారు. కొత్త వాటితో నూతన జీవితం ఆరంభించడానికి గుర్తుగా సంవత్సరంలో చలిని పాలద్రోలడానికి ఇంట్లో ఉండే పాత కలప, ఇతర సామాన్లు ఈ మంటల్లో వేసి భోగి మంటలను ఆస్వాదించారు. కొన్ని చోట్ల చిన్నారులపై భోగి పళ్లు పోసి దీవించారు.

రాష్ట్ర ప్రజానీకానికి కృష్ణదాస్ 'సంక్రాంతి' శుభాకాంక్షలు

విశాలాంధ్ర-నరసన్నపేట : రాష్ట్ర ప్రజలందరి జీవితాల్లో ఈ మకర సంక్రాంతి ప్రగతి తీసుకు వచ్చి, వెలుగులు నింపిందని, మాజీ డిప్యూటీ సిఎం, ధర్మాన కృష్ణదాస్ అన్నారు. శనివారం సోషల్ మీడియా వేదికగా కృష్ణదాస్ రాష్ట్ర ప్రజానీకానికి, వైసిపి కుటుంబ సభ్యులకు సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. మన సంస్కృతి, సాంప్రదాయాలను ప్రతిబింబించే అచ్చమైన తెలుగు పండుగను అందరి ఇళ్ళలో సంతోషంగా జరుపుకోవాలని కృష్ణదాస్ అభిలాషించారు.

సైకో పోవాలంటూ బోగిమంట

విశాలాంధ్ర-సరుబుజ్జిలి : సరుబుజ్జిలి మండలంలోని సరుబుజ్జిలి, చిన్నకాగితపల్లి, గోనుపాడు, తెలిగిపెంట, యరాగం, పెద్దసవలపురం, రొట్టవలస, వివిధ పంచాయతీలలో పార్లమెంట్ అధ్యక్షులు కున రవికుమార్ పిలుపు మేరకు బోగిపండగ సందర్భంగా సైకోపోవాలంటూ నినాదాలు చేస్తు పేపర్ పైన సైకో పోవాలని వ్రాసి బోగిమంటలలో భస్మం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

సరుబుజ్జిలిలో కమ్ముకున్న పొగమంచు

విశాలాంధ్ర-సరుబుజ్జిలి : జిల్లావ్యాప్తంగా పొగమంచు కమ్ముతుంది, రైతులు ఇప్పటికే ధాన్యం అమ్ముడుపోక దిగాలుగా ఉంటే పొగమంచు ప్రాణాలమీదికి వచ్చింది. పెసర, మినప పంటలు పువ్వునుండి పింజదసికి చేరేసరికి పొగమంచు పువ్వును మాడు చేస్తుందని రైతులు పేర్కొన్నారు, ప్రభుత్వాధికారులు పంటను పర్యవేక్షించి నష్టపరిహారాన్ని మంజూరు చేయాలని రైతులు కోరుతున్నారు.

కనుల పండుగగా శ్రీగోదా రంగనాథ స్వామివారి కళ్యాణం

విశాలాంధ్ర-కవిటి : మండలంలోని బెజ్జి పుట్టుగ శ్రీ చక్రపెరుమాళ్ళస్వామి ఆలయంలో అర్చకులు సత్యం స్వామి ,రాజుస్వామి, రాజేష్ స్వామి, ఆధ్వర్యంలో గోదా కళ్యాణం కనుల పండుగగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా శనివారం స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేపట్టి వేకువజాము నుండి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు మాట్లాడుతూ ధనుర్మాసం విష్ణువికి చాలా ప్రత్యేకమైనది. ధనుర్మాసం నెల రోజుల పాటు సుప్రభాతం బదులు తిరుప్పావై గానం చేస్తారు. సహస్రనామార్చనలో తులసీదళాలకు బదులు బిల్వపత్రాలను ఉపయోగిస్తారు. విష్ణు ఆలయాలల్లో ఉదయం అర్చనలు చేసి నివేదనలు చేసి వాటిని పిల్లలకు పంచుతారు. ఇలా చేయడాన్ని బాలభోగం అంటారు. ధనుర్మాసంలో ఉదయం, సాయంత్రం దీపారాధన చేయడం వల్ల లక్ష్మీదేవి అనుగ్రహంతో పాటు,దరిద్రం దూర మవుతుందని తెలిపారు.ఈ నెలలో ప్రతి రోజు బ్రహ్మ ముహూర్తంలో పారాయణం చేసిన వారు దైవానుగ్రహానికి పాత్రులవుతారని ప్రతీతి. భూదేవి, అవతారమైన అండాళ్ రచించిన దివ్య ప్రబంధమే తిరుప్పావై అన్నారు . ద్రావిడ భాషలో తిరు అంటే పవిత్రమైనది, పావై అంటే వ్రతం అని అర్థం. ధనుర్మాసంలో విష్ణువును మధుసూధనుడు అనే పేరుతో పూజించి, మొదటి పదిహేను రోజులు చక్కెర పొంగలి లేదా పులగం స్వామికి నైవేద్యంగా సమర్పించాలి. తర్వాత పదిహేను రోజులు దద్యోజనం అర్పించాలి. పెళ్లికాని అమ్మాయిలు ఇంటి ముందు ముగ్గులు, గొబ్బిళ్లతో పూజలు చేయటం వల్ల తాము కోరిన వరుడు లభిస్తాడు అన్నారు. గోదాదేవి మార్గళి వ్రతం పేరుతో విష్ణువును ధనుర్మాసమంతా పూజించింది. శ్రీకృష్ణుని ధనుర్మాసం నెలరోజులూ తులసీ మాల సమర్పించే యువతులకు, నచ్చిన వరునితో వివాహం జరుగుతుంది. ధనుర్మాస వ్రతం దీని గురించి మొదట బ్రహ్మదేవుడు నారద మహర్షికి వివరించినట్లు పురాణ కథనం. ధనుర్మాస వ్రతం గురించి బ్రహ్మాండ, ఆదిత్య పురాణాల్లో, భాగవతంలో, నారాయణ సంహితలో కనిపిస్తాయి. ఈ వ్రతం ఆచరించాలనుకునే వాళ్లు తమ స్థోమతను బట్టి విష్ణు ప్రతిమని చేయించి పూజించాలి. ప్రతిరోజూ సూర్యోదయానికి ముందే స్నానాలు పూర్తిచేయాలి. పంచామృతాలతో మహావిష్ణువును అభిషేకించి. తర్వాత తులసీ దళాలు, పూలతో అష్టోత్తర సహస్రనామాలతో స్వామిని పూజించి నైవేద్యం సమర్పించాలి. నెలరోజులూ చేయలేని వాళ్లు 15 రోజులు, 8 రోజులు లేదా ఒక్క రోజైనా చేయవచ్చు. ధనుర్మాస వ్రతం చేయడం వల్ల ఇహలోక సుఖాలు, పరలోక మోక్షం పొందుతారు. ఆత్మపరమాత్మను చేరడానికి ఉపకరించేదే ధనుర్మాస వ్రతం. ప్రాచీన కాలం నుంచి భారతీయులందరూ ఈ వత్రాన్ని ఆచరిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పొందల కృష్ణారావు, కుమారి దంపతులతో పాటు చుట్టుపక్కల గ్రామాల మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రగడ పుట్టుగలో... కోదండ రామాలయం ప్రాంగణం వద్ద గోదా రంగనాయక కళ్యాణ ఉత్సవంలో ఎమ్మెల్యే బెందాళం అశోక్ పాల్గొన్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులు నెల రోజులు పాటు చేపట్టిన గోదా పూజలను శనివారం శ్రీ గోదా రంగనాథ స్వామి వారి కళ్యాణంతో ముగింపు చేపట్టారు.ఈ కార్యక్రమం సోమేశ్వరి కృష్ణారావు, విద్యాసాగర్ దంపతులు ఆధ్వర్యంలో యజ్ఞనంద్, శాంతారాం, అంగద స్వామి పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు నారాయణ సేవ నిర్వహించారు.

నెలవంకలో... మండలంలోని నెలవంక పంచాయతీ సీమూరులో గోదాదేవి కల్యాణంలో ఎమ్మెల్యే బి అశోక్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దక్కత ఢిల్లీరావు, బాలాజీ, లోకనాథం, యు.ఉమాపతి, శివాజీ, సీమూరు నాయుడు, పెద్దలు, మహిళలు, యువత, భక్తులు పాల్గొన్నారు.

సరదాల సంక్రాంతి

విశాలాంధ్ర-పలాస : ముంగిళ్లలో రంగు రంగుల రంగ వల్లులు... ఇంటింటికీ తిరుతుతూ హరిలో రంగ హరి అంటు శ్రావ్యంగా కీర్తనలు ఆలపించే హరిదాసులు... గంగిరెద్దుల విన్యాసాలు... ఎటు చూసిన ఘుమఘుమ లాడే పిండి వంటలు... అత్తగారింటికి వచ్చిన అల్లుళ్లు... వారిని ఆట పట్టించే మరదళ్లు... గాలి పటాలు ఎగుర వేసే చిన్నారులు... కనుల పండుగగా సాగే బొమ్మల కొలువులు ఇవీ సంక్రాంతి పండుగ అనగానే గుర్తుకొచ్చే అంశాలు. తెలుగు ప్రజల పెద్ద పండుగ సంక్రాంతి వచ్చి... సరదాల సందడి తీసుకొచ్చింది.

తెలుగు ప్రజలు జరుపుకునే పండుగల్లో ముఖ్యమైనది సంక్రాంతి. భోగి, సంక్రాంతి, కనుమ కలుపుకొని మూడు రోజులు పాటు ఈ పండగను జరుపుకుంటారు. కొన్ని చోట్ల ముక్కనుముతో కలుపుకొని నాలుగు రోజుల పాటు పండుగను చేసుకుంటారు. ముఖ్యంగా పంట చేతికి వచ్చిన ఆనందంలో రైతులు జరుపుకునే పండుగ కావడంతో దీనిని రైతుల పండుగ అని కూడా అభివర్ణిస్తారు. జనవరిలో వచ్చే సంక్రాంతికి నెల రోజుల ముందు నుంచే గ్రామాలు తెలియని ఆనందాలతో, ఆహ్లాద సందడితో అలరారుతాయి. జానపద కళలు, గంగిరెద్దులను ఆడించే వారు గ్రామాలకు రావడం మొదలు పెడతారు. మహిళలు, యువతలు రోజూ ఇంటి వాకిళ్లలో ముచ్చటైన రంగుల ముగ్గులతో తీర్చిదిద్ది, రంగులు, గొబ్బెమ్మలతో అలంకరించి మురిసి పోతారు. పొలాల నుంచి ధాన్యం ఇంటికి చేరుతుంది. వ్యవసాయ పనులతో కూలీలు కూడా నాలుగు రూపాయలు సంపాదించిన సమయం. దీంతో వ్యవసాయ అనుబంధ కుటుంబాలన్నీ ఈ పండగని సంతోషంగా జరుపుకుంటారు. హిందువుల పండగల్లో సంక్రాంతి మినహా మిగతా పండగలన్నీ చాంద్రమానాన్ని అనుసరించడం వల్ల సంవత్సరంలో వేర్వేరు తేదీల్లో వస్తాయి. సంక్రాంతి మాత్రమే సౌరగమనాన్ని అనుసరించడం వస్తుంది, అందుకే ప్రతీ ఏటా సంక్రాంతి జనవరి 15వ తేదిన పండుగ వస్తుంది.

సంక్రమణమే సంక్రాంతి : సంక్రాంతి అంటే సంక్రమణం అని అర్థం. సంక్రమణం అంటే మారడం లేదా చేరడం అని చెప్పవచ్చు. సూర్యుడు మేషాది ద్వాదశ రాశులందు సంక్రమిస్తూ ఉత్తర రాశిలోకి ప్రవేశించే పర్వదినమే సంక్రాంతి. పుష్యమాసం, హేమంత రుతువులో శీతల గాలులు వీస్తు మంచు కురిసే కాలమైన జనవరి 15న సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశిస్తాడు. సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశించగానే మకర సంక్రమణం జరుగుతుంది. దీనినే మకర సంక్రాంతిగా పిలుచుకుంటారు. మకర సంక్రాంతి రోజున సూర్యుడు ఉత్తరాయణ పథంలో అడుగు పెగతాడు కనుక ఆ రోజు నుంచి స్వర్గధ్వారాలు తెరిచి ఉంటాయని, అందుకే మకర సంక్రాంతికి అంత ప్రాముఖ్యత ఏర్పడిందని పురణాలు చెబుతున్నాయి.

పొంగళ్ళ సంక్రాంతి : పండుగలో రెండో రోజైన సంక్రాంతి రోజున పాలు పొంగించి, పొంగలి తయారు చేస్తారు. అరిసెలు, జంతికలు, పాయసం, పులిహోర తదితర రకాల వంటలను తయారు చేసి, కొత్త దుస్తులను ధరించి పండుగను జరుపుకుంటారు. పితృ దేవతలకు తర్పణాలు వదులుతారు. సంవత్సరంలో వచ్చు 11 సంక్రాంతులకు పితృతర్పణాలు ఇవ్వకపోయినా, మకర సంక్రాంతికి మాత్రం తప్పకుండా తర్పణాలు ఇస్తారు. సంక్రాంతి సంబరాలు పేరుతో గ్రామాల్లో పిల్లలకు, పెద్దలకు, మహిళలకు క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తారు. ఇంటి ముందు రంగు రంగుల రంగవళ్లలు మధ్య గొబ్బెమ్మలు, హరిదాసు సంకీర్తనలతో సంక్రాంతి రోజులు మధురానుభూతిని కలిగిస్తాయి.

సాంప్రదాయాన్ని గుర్తు చేసే గంగి రెద్దులు : మన పెద్దలకు గౌరవించడంతో పాటు వినయ విధేయతలతో మెళగాలనే సూచికగా సంక్రాంతి సందర్భంగా గ్రామాల్లో గంగిరెద్దులు తమ విన్యాసాలతో గుర్తు చేస్తాయి. గంగి రెద్దుల వారు డోలు, సన్నాయి మేళంతో ఇంటింటి తిరిగి, అమ్మగారికి దండం పెట్టు... అయ్య గారికి దండం పెట్టు... అంటూ గంగి రెద్దులతో విన్యాసాలు ఎంతగానో ఆకట్టుకుంటాయి.

కనుమ నాడు మినుము తినాలి : పండుగ మూడో రోజు కనుమ. వ్యవసాయంలో తమకు ఎంతో చేదోడు వాదోడుగా ఉన్నందుకు పశువులకు పూజిస్తారు. కనుమ నాడు మినుమ తినాలనే సామెత ఉంది. ప్రతీ ఇంటా ఆ రోజు మినుమలతో గారెలు, ఇడ్లీలు చేసుకొని కుటుంబ సభ్యులు, అల్లుళ్లతో కలిసి భుజిస్తారు. మాంసాహార ప్రియులు గారెలకు తమకు ఇష్టమైన కోడి, మేక మాంసం కూరలను ఎంతో మక్కువగా ఆరగిస్తారు.

డు.. డూ.. బసవన్నా

- కనుమరుగవుతున్న గంగిరెద్దుల సాంప్రదాయం
- అరుదుగా కనిపిస్తున్న గంగిరెద్దుల విన్యాసాలు
- ఆదరణ లేక వలసపోతున్న కళాకారులు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : గంగిరెద్దులాట మన సంస్కృతిలో ఓ భాగం.. సంక్రాంతి వచ్చిందంటే చాలు.. గంగిరెద్దులాటలతో పల్లెలన్నీ సందడిగా మారుతాయి. గంగిరెద్దుల సందడి.. డూడూ బసవన్నల విన్యాసాలతో గ్రామాలు సందడిగా మారుతోంది. సరదా సరదా పాటలతో గంగిరెద్దులను ఆడించి ప్రజలను సంతోషపెట్టే మేళగాళ్లు కనుమరుగవుతున్నారు. ఒకప్పుడు దేదీప్యమానంగా వెలిగిన ఈ సాంప్రదాయం.. ప్రస్తుతం చాలా అరుదుగా దర్శనమిస్తుస్తోంది. గంగిరెద్దులను ఆడించే కుటుంబాలు ఇతర ఉపాధిని వెతుక్కోవడంతో క్రమంగా ఈ సాంప్రదాయం కనుమరుగవుతోంది. వాస్తవానికి గంగిరెద్దులాట అనేది ఒక జానపద కళారూపం. ఇది ప్రాచీనమైనది. కానీ, గంగిరెద్దులోళ్ల జీవితాలు చీకటి మయమయ్యారు. అయితే పట్టణీకరణతో గంగిరెద్దుల విన్యాసాల మీద కూడా కత్తిగట్టినట్లే అనిపిస్తుంది. పట్టణాలతో పాటు, పల్లెల్లో కూడా పెరుగుతున్న పట్టణీకరణతో గంగిరెద్దుల విన్యాసాలు మాయమవుతున్నాయి. కనుమరుగవుతున్న సాంప్రదాయాలపై విశాలాంధ్ర ప్రత్యేక కథనం.....

భారతీయ జీవన విధానంలో పశు సంపదక ఎంతో ప్రాముఖ్యం ఉన్నది. ఆవును గోమాతగా భావిస్తే.. ఎద్దు.. నందీశ్వరుడిగా పూజలు అందుకొంటున్నది. ఆ పాడి పశువులే ప్రధాన పాత్రధారులయ్యే జానపద కళారూపం గంగిరెద్దులాట .. మన సంస్కృతిలోనూ భాగమైంది. పూర్వకాలం నుంచీ మనుగడలో ఉన్న ఈ కళ.. పల్లెవాసులతో పాటు పట్టణ వాసులనూ అలరిస్తున్నది. తెలుగు వారి పండుగలలో సంక్రాంతి పండుగకు ప్రాధాన్యత ఉంది. సంప్రదాయం, సంస్కృతికి అద్దం పట్టే పండుగ సంక్రాంతి. ఆరుకాలం శ్రమించి పండించిన పంటలు చేతికందే సమయంలో ఈ పండుగ రావడంతో గ్రామీణ ప్రాంతాల్లోని రైతుల ఇళ్లల్లో ఆనందం వెల్లు విరుస్తుంది. గంగిరెద్దుల విన్యాసాలు సంక్రాంతికే ప్రత్యేకమని చెప్పొచ్చు. అయ్యగారికి దండం పెట్టు.. అమ్మగారికి దండం పెట్టు..అంటూ చెప్పే యజమాని సూచనలకు అనుగుణంగా తల ఊపే బసవన్నలు కొత్త వస్త్రాల అలంకరణలో ఆకట్టుకుంటాయి. ఈ సంప్రదాయం ప్రస్తుతం చాలా అరుదుగా దర్శనమిస్తోంది. వ్యవసాయానికి దన్నుగా ఉండే బసవన్నలు లేకపోవడమే నేడు ఈ పరిస్థితికి కారణమని రైతులు చెబుతున్నారు. పండుగ నెల వచ్చిందంటే బసవన్నలు గ్రామాల్లో తిరుగుతూ..సందడి చేయడం పరిపాటి. సంక్రాంతికి కొన్ని చోట్ల ప్రత్యేక ప్రదర్శనలు ఏర్పాటు చేస్తుంటారు. ఆడిస్తూ.. ఆశీర్వదిస్తూ.. సంక్రాంతి పర్వదినాల్లో ఇంటింటికీ తిరుగుతూ గంగిరెద్దులను ఆడిస్తారు. తమ ఇంటికొచ్చిన గంగిరెద్దును సాక్షాత్తు నందీశ్వరుడి స్వరూపంగా భావించి ఇంటి వాళ్లు హారతి పట్టి పూజిస్తారు. డూ..డూ బసవన్న.. రారా బసవన్నా.. అనగానే ఎద్దులు ముందుకు వస్తాయి. అమ్మవారికి దండం పెట్టూ.. అయ్యగారికి దండం పెట్టు అనగానే ముందరి కాలెత్తి సలాం చేస్తాయి. అయ్యగారికి శుభం కలుగుతుందా..? తలపెట్టబోయే కార్యం సఫలమవుతుందా..? అనగానే గంగిరెద్దులు తలాడించడాన్ని శుభ సూచికంగా, నందీశ్వరుడి దీవెనగా భావిస్తారు. గంగిరెద్దువాళ్లు కూడా ఎద్దు ముందు కాళ్లను ఛాతీమీద పెట్టుకొని ఆడిస్తారు. ఇంటిల్లిపాదినీ తమదైన శైలిలో పొగుడుతూ.. ఆశీర్వచనాలు ఇస్తారు.

భోగి మంటలతో కొత్త వెలుగులు

విశాలాంధ్ర - ఆమదాలవలస : భోగి పండుగ భోగి మంటలతో ప్రారంభమై సంక్రాంతి పండుగ వాతావరణంలో భోగి మంటలతో కొత్త వెలుగులు వచ్చే వేళ అయింది. ఊరు ముఖం వెలిగిపోయేలా భోగి మంటలు వాడవాడలా వేసుకునే రోజుది. ధాన్య లక్ష్మి ఇంటికి చేరిన వేళ అన్నదాన ఆనందంతో జరుపుకునే పండుగ భోగి.. స్థానిక జిల్లా పరిషత్ ఎదురు ఏపీహెచ్‌బీ కొలనీలో కొలనీ వాసులు భోగి మంటలు ముందు స్త్రీలు. పురుషుల. పిల్లలు నాట్యాలు.. డాన్స్‌లు వేసి పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో అలపాన త్రినాథ రెడ్డి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నేడ్ క్యాప్ కార్పొరేషన్ డైరెక్టర్.. పీపుల్స్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు డా. గంజి ఎజ్రా



కొలనీ వాసులు పెద్దలు, మాధవరావు. జయప్రద. కోదండరావు దీపిక, రాజు, భారతి, రాధాకృష్ణ.. మాలిని, నాగేశ్వరరావు. లావణ్య, చిన్నారులు, కార్తీక నేహ గీతీక. అగస్త్య. గౌతమ్. చిన్ని. నీతూ. హరిప్రియ. రోషన్. సృజన. జాహ్నవి. దక్ష. తదితరులు పాల్గొన్నారు.

ఆముదాలవలస వలస మండలం గాజులు కొల్లివలస దరి సంగమేశ్వరుని కొండ వద్ద

భోగి సంక్రాంతిని, కనుమలను పురస్కరించుకొని సైకిత చిత్రకారుడు గేదెల హరికృష్ణ ఆధ్వర్యంలో శుభాకాంక్షలు తెలుపుతూ సైకిత శిల్పాన్ని రూపొందించారు. ముఖ్యంగా మూడు రోజులపాటు జరుగు సంగమేశ్వరుని జాతర సందర్భంగా ఈ సైకిత శిల్పాన్ని నిర్మించారు.

ముగిసిన క్రికెట్ పోటీలు

విశాలాంధ్ర-జలుమూరు: సారవకోట మండలం ధర్మలక్ష్మీపురంలో గత 20రోజులుగా నిర్వహించిన ఫ్రెండ్లీ క్రికెట్ టోర్నమెంట్ లీగ్ పోటీలు శనివారం ముగిసాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి హాజరయ్యారు. విజేతలకు ఆయన బహుమతులను అందించారు. ఆయన మాట్లాడుతూ.. 20 రోజులు పాటు సుదీర్ఘంగా క్రికెట్ పోటీలు నిర్వహించిన నిర్వాహకులను ఆయన అభినందించారు.

వైసీపీ ఫ్లెక్సీల చింపివేతపై పోలీసులకు మాతల సర్పంచ్ ఫిర్యాదు

విశాలాంధ్ర-కొత్తూరు : మండలం తెలుగుదేశం కు చెందిన మాజీ ఎమ్మెల్యే కలమట వేంకట రమణ స్వగ్రామం మాతలలో వైస్సార్ కాంగ్రెస్ పార్టీ వాళ్ళు సంక్రాంతి సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని చించివేశారంటూ వైసీపీకి చెందిన ఆ గ్రామ సర్పంచ్ కలమట సుప్రియ శనివారం కొత్తూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇందుకు సంబంధించిన ఫిర్యాదు కాపీని స్థానిక మీడియా ప్రతినిధులకు అందజేశారు. ఆ ఫిర్యాదులోని అంశాలు ఇలా ఉన్నాయి, భోగి, సంక్రాంతి పండుగ ల నేపథ్యంలో గ్రామంలో వైసీపీ పార్టీ అభిమానులు, కార్యకర్తలు ప్రజలకు, వైసీపీ నేతలకు శుభాకాంక్షలు తెలియజేసే ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు ఇది గమనించిన మాజీ ఎమ్మెల్యే వేంకట రమణ అనుచరులైన రేగేటి సూర్యం, నాసర హరి అనే వ్యక్తులు శనివారం వేకువ జామున 3 గంటల సమయం లో వైసీపీ వారు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని చించివేశారు. ఆ సమయంలో ఇది గమనించిన వారు మాకు ఈ విషయాన్ని తెలిపారు, మాజీ ఎమ్మెల్యే వేంకట రమణ ప్రోత్సాహంతోనే సదరు ఫ్లెక్సీ ని చించివేశారంటూ తన ఫిర్యాదులో సర్పంచ్ సుప్రియ పేర్కొన్నారు. ఈ సంఘటన పై విచారణ జరిపి కారకులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

తెలుగు ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు

ఏపీ శాసనసభాపతి తమ్మినేని సీతారాం

విశాలాంధ్ర-ఆమదాలవలస : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలు ప్రజలకు సంతృప్త స్థాయిలో అందుతుండటంతో నూతన సంవత్సర ఆరంభానికి ముందే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రతీ లోగిళ్ళలో సంక్రాంతి కళ సంతరించుకుందని ఏపీ శాసన సభాపతి తమ్మినేని సీతారాం అన్నారు.భోగి మంటల వెచ్చటి వెలుగులు పరిపూర్ణమైన ప్రసాదించాలని మకర ఆరోగ్యాన్ని కాంతులతో ప్రతీ ఇల్లు సంక్షేమ, సౌభాగ్యాలతో శోభాయమానంగా వెలుగొందాలని, కనుమ పూజలతో పల్లెసీమలు.. పశుసంపద, వ్యవసాయ, ఉద్యాన పంటలతో సుభిక్షంగా కలకళలాడాలని ఆకాంక్షిస్తూ ప్రపంచవ్యాప్తంగా తెలుగు ప్రజలందరికీ స్పీకర్ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. వ్యవసాయాధారిత జీవనం సాగించే తెలుగు రాష్ట్రాలలో సంక్రాంతి పండుగకు ప్రత్యేకత ఉందని,కొత్త పంటలు చేతికందిన రైతులు,ఇంటి నిండా ధాన్య సిరుల, సంపదల మధ్య ఆనందంగా జరుపుకునే పండుగే ఈ సంక్రాంతి అన్నారు.సనాతన సంప్రదాయాలను గుర్తుకు తెచ్చి,అల్లుళ్ళు, బంధుమిత్రులతో సరదాగా చేసుకునే పండుగే సంక్రాంతి అన్నారు. ఈ ఏడాది ప్రకృతి అన్నివిధాలా కరుణించి జిల్లాలో సమృద్ధిగా వర్షాలు కురిసి.. సిరుల పంటలు పండాలని కోరారు. ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని, అందరి భాగస్వామ్యంతో అభివృద్ధిలో రాష్ట్రం, జిల్లా, ఆముదాలవలస నియోజకవర్గం ముందడుగు వేయాలని ఈ సందర్భంగా ఆయన అభిలషించారు. జిల్లా అధికారులకు, ప్రజా ప్రతినిధులకు,వైసిపి నియోజకవర్గ, మండల, గ్రామస్థాయి కేడర్‌కు తమ్మినేని అభిమానులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

మారుతీవాకర్స్ ఆధ్వర్యంలో భోగీ వేడుకలు

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్ : మారుతీ వాకర్స్ ఆధ్వర్యంలో భోగీ వేడుకలు ఘనంగా శనివారం నిర్వ హించారు. మారుతీ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు, వాకర్స్ 102 డిప్యూటీ గవర్నర్ కొంక్యాన మురళీధర్ ఆధ్వర్యంలో నగరంలోని విశాఖ-బి కాలనీలోని గౌతమ్ నగర్లో భోగీ మంటను మురళీధర్ చేతుల మీదుగా వెలిగించారు. కాలనీయూత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఒకరికొకరు సంక్రాంతి శుభకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మురళీధర్ మాట్లాడుతూ సంస్కృతి, ఆచారాలు, సంప్రదాయాలు మానవ జీవితాన్ని సత్య మార్గంలో తీసుకెళ్లేందుకు సంక్రాంతి దోహదపడుతుందన్నారు. ఉత్తరాయణం అనేది ఎంతో పుణ్యకాలమని, ప్రజల విశ్వాసంగా ఉన్నందున అందరూ సూర్యభగవానుడిని ఆరాదించి ప్రజలను చల్లగా చూడాలని పూజలు నిర్వహిస్తామని మురళీధర్ చెప్పారు. ఏపిడబ్ల్యుజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కొంక్యాన వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రజలంతా ఆనందోత్సాహాలతో సంక్రాంతి పండగ జరుపుకోవాలన్నారు. భారతీయ సంస్కృతి సంప్రదాయాలు ప్రపంచానికి ఆదర్శమన్నారు. ఈ కార్యక్రమంలో మారుతీవాకర్స్ క్లబ్ కార్యదర్శి పొట్నూరు నాగేశ్వరరావు, కోశాధికారి పి. నారాయణమూర్తి, ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజేంద్రప్రసాద్, పొట్నూరు రమేష్, బైరెడ్డి శంకరరావు కాలనీ పెద్దలు, యువత పాల్గొన్నారు.

ఫిబ్రవరి 1న శ్రీలక్ష్మి నరసింహస్వామి కళ్యాణం

విశాలాంధ్ర-జలుమూరు : మండలంలోని గ్రామంలో చిన్నదూగాం శ్రీలక్ష్మినరసింహస్వామి కళ్యాణం ఫిబ్రవరి 1 నుంచి 5వ తేదీ వరకు వార్షిక మహోత్సవం జరుపుతున్నట్లు దేవాదాయశాఖ ఆధ్వ ర్యంలో గ్రామపెద్దలు, ప్రజలు, భక్తులతో సమావేశం నిర్వహించనున్నట్లు ఆలయ ఇన్‌చార్జి ఈవో వివి సూర్యనారాయణ తెలిపారు. ఫిబ్రవరి 1న భీష్మ ఏకాదశి ఉత్సవ సందర్భంగా స్వామివారిని దర్శించు టకు అవసరమైన అన్ని ఏర్పాట్లును, ఫిబ్రవరి 3వ తేదీన స్వామి వారి కళ్యాణంను దేవాదాయశఖ తరపున అత్యంత వైభవంగా నిర్వహించుటకు నిర్ణ యించడమైనది. వార్షిక జాతర సందర్భంగా గ్రామం లో గ్రామస్తులు సహాయ సహకారములతో సాంస్కృతిక, సాంఘిక నాటకములు, విద్యుత్ అలంక రణ, స్టేజీ ఏర్పాట్లును గ్రామం తరపున ఏర్పాటు చేయుటకు గ్రామ పెద్దలు నిర్ణయించినట్లు ఆలయ ఇఓ తెలియజేశారు.

ఆత్మీయ సదస్సు

విశాలాంధ్ర-ఆమదాలవలస: సంక్రాంతి పండగ సందర్భంగా కలిసి చదువుకునే వారంతా ఒకచోట సమావేశమై ఏడాది పొడుగునా జరిగిన సన్నివేశాన్ని స్మరించుకుంటూ శనివారం కాలం వెళ్ళబుచ్చారు. 1996-98, ఇంటర్మీడియట్ గవర్నమెంట్ జూనియర్ కళాశాలలో చదువుకున్న విద్యార్థులంతా శనివారం కళాశాల ప్రాంగణంలో ఆత్మీయ సదస్సు నిర్వహించారు. ఆ బ్యాచ్‌లోని విద్యార్థి మన్మధరావు ప్రస్తుతం జిల్లా రిజిస్టర్ గా పనిచేస్తున్నారు. అలాగే మిగిలిన వారు కూడా చిన్న చిన్న వృత్తులు, వ్యాపారాలు, చిరు ఉద్యోగాలు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటూ పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తున్నట్లు వారి ఆత్మీయ సమావేశంలో వెల్లడించుకున్నారు. జిల్లా రిజిస్టర్‌తో కలిపి చదువుకున్న పూర్వ విద్యార్థులతో ఆత్మీయ సమావేశం ఆనందోత్సాహాల నడుమ జరుపుకున్నారు. ఈ కలయికలో పూర్వ విద్యార్థి ప్రస్తుత జిల్లా రిజిస్టర్ మన్మధరావు కూడా ఒక సభ్యుడుగా ఉన్నాడు. గడిచిన 15 ఏళ్ళుగా వీరు అందరూ ఒక టీంగా ఏర్పడి ఎవరికి ఏకష్టం వచ్చిన తాము ఉన్నాం అంటూ సాయం చేస్తూ వాళ్లకి ఆర్థికంగా భరోసాను ఇస్తూ వాళ్ళ కష్టాలను తీర్చుతున్నారు. ఇక ముందు కూడా మంచి కార్యక్రమాలు చేయాలని తీర్మానించుకున్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు తమ పూర్వ జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈ కార్యక్రమానికి జిటి నాయుడు, విక్రమ్ తదితర పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

మార్పు పద్మనాభం ఆశయాలను కాపాడుకుందాం

విశాలాంధ్ర-పలాస : శ్రీకాకుళం ఉద్యమ కీర్తి, పతాక ప్రతిష్టను కాపాడిన తొలితరం కమ్యూనిస్టు నాయకులు కామ్రేడ్ మార్పు పద్మనాభం ఆశయాలను కాపాడుకుందామని పలువురు వామపక్ష నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం కామ్రేడ్ పద్మనాభం 57వ వర్ధంతి సభ బొడ్డపాడు అమరవీరుల స్మారక మందిరంలో లిబరేషన్ నాయకులు కామ్రేడ్ మద్దిల రామారావు అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా లిబరేషన్ రాష్ట్ర నాయకులు కామ్రేడ్ మద్దిల మల్లేశ్వరరావు, సిపిఐ పలాస నాయకులు కామ్రేడ్ చాపర వేణుగోపాల్, న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు కామ్రేడ్ వంకల మాదవరావు, సిపిఎం పలాస నాయకులు నెయ్యి గణపతిలు మాట్లాడుతూ వ్యవసాయాన్ని కార్పొరేట్ లకు దారాదత్తం చేయడానికి వ్యతిరేకంగా రైతాంగాన్ని సమీకరించి పోరాటం చేయడం ద్వారా కామ్రేడ్ మార్పు పద్మనాభంకు నిజమైన నివాళ్లు అర్పించిన వారమవుతామని, పలాస మార్పు పద్మనాభం విజ్ఞానం కేంద్రం ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో మద్దిల రామారావు, వినోద్, బాలక్రిష్ణ, సి.హెచ్.రవి, వై.మురళీ, పిన్నింటి నాగేశ్వరరావు, దుశ్యంత్, కామేశ్వరరావులు పాల్గొన్నారు.

మందస: మార్పు పద్మనాభం 57వ వర్ధంతి సభ హరిపురం మార్పు గ్రంథాలయం ఆవరణలో మార్పు విగ్రహానికి మార్పు ట్రస్టు అధ్యక్షులు డాక్టర్ ఎం.ఖగేశ్వరరావు పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్పు పద్మనాభం చూపిన మార్గంలో ప్రతి ఒక్కరు నడవాలన్నారు. కార్యక్రమంలో యు.సోమ నాథం, వి.వి.రమణమూర్తి, నారాయణరావు, ఎం.ధర్మారావు, దేవేంద్ర, ఎం.మాధవరావు, ముకుందరావు, వీరాస్వామి, పుచ్చ దుర్యోదనలు పాల్గొన్నారు.